పెద్దకథ:




■ రేఖ కూర్చున్న బెంచీలోనే కూర్చుని 'మీతో మాట్లాడాలి' అన్నాడు కృష్ణమూర్తి.

'ఏమిటి?' అంది రేఖ.

'ఇక్కడ కాదు. కొంచెం అవతలికి రండి.

'ఇక్కడ చెప్పండి. ఫరవాలేదు.'

'ముఖ్యమైన విషయం.'

రేఖ నవ్వి బెంచీలోంచి లేచి దూరంగా గడ్డిలో కూర్చుని 'ఊఁ. చెప్పండి' అంది.

కృష్ణమూర్తి వెంటనే మాట్లాడలేకపోయాడు. చుట్టూ చూస్తూ ఉండిపోయాడు.

అది అందమైన లాన్. ఇంటి ఆవరణలో ఉండి ఇంటికి చాలా అందమిస్తోంది. పార్కులాఉంటుంది చూడటానికి. పూసేవి, పుయ్యనివి రక రకాల మొక్కలు. గడ్డి అంతా అందంగా కత్తిరించబడి ఉంది. అక్కడక్కడ సిమెంటు బెంచీలు ఉన్నాయి.

ఆహ్లాదకరమైన వాతావరణం. కాసేపు కూర్చుంటే చక్కటి ఊహలు వస్తాయి. ఒక్కళ్ళే ఉన్నా ఒంటరితనం అన్పించదు.

అతను రేఖని పరీక్షగా చూస్తున్నాడు.

అందమైన రేఖది లేత ముఖం, లేత మనసు. నిర్మలమైన చూపులు. పదహారు దాటి పదిహేడులోకి అడుగు పెడుతున్న అమ్మాయికి ఉండే లాలిత్యం. డబ్బు వల్ల వచ్చే హుందాతనం, రాజసం. చూపులు తిప్పుకోలేని ఆకర్షణ.

'ఏమిటి అలా చూస్తున్నారు?' అంది రేఖ.

కృష్ణమూర్తి తడబడి మాట్లాడలేకపోయాడు.

'భలేవారే, ఏదో మాట్లాడాలని నన్ను

క్కడికి తీసుకువచ్చి తమాషా చేస్తున్నారా అంది నవ్వి.

రేఖ మొహంలోకి చూస్తూ 'మీరు బి.ఏ. అయిన తర్వాత ఏం చేస్తారు?' అన్నాడు.

'అవనియ్యండి. ఇంకా రెండేళ్ల తర్వాత మాట గదా!'

'ముందు ఆలోచించుకోవచ్చు గదా'

అంత అవసరం ఏముంది?'

'అవసరం అయే అడుగుతున్నా.'

'నేనేమీ అనుకోవడం లేదు. పైకి చదువుతానేమో'

'అదీ అయిం తర్వాత?'

రేఖ నవ్వి 'ఎందు కడుగుతున్నారు?' అంది.

కృష్ణమూర్తి కిందికిచూస్తూ 'మీకు నిజంగా తెలియలేదా?' అన్నాడు.

రేఖ తేలిగ్గా నవ్వి 'ఏమో బాబూ నా కంత సూక్ష్మదృష్టి లేదు' అంది.

'సరేలెండి. మీ నాన్నగారి ఉద్దేశం ఏమిటి?'

'ఏ విషయంలో?'

'మీ విషయంలో'

'నా విషయంలో అంటే?'

'పోనీ మీ చదువు విషయంలో అనుకోండి.'

'మా నాన్నగారికే ఉద్దేశాలూ లేవు. నా ఉద్దేశమే ఆయన ఉద్దేశం. నేను చెప్పింది కాదనరు.'

కృష్ణమూర్తి నాలుగు క్షణాల పాటు గడ్డిపరకలు తుంపుతూ ఉండి పోయాడు. తర్వాత తిన్నగా ఆమె వైపు చూడకుండా ఇబ్బంది పడుతూ 'పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు?' అన్నాడు.

రేఖ నవ్వి 'ఇందాకటినుంచీ ఇన్ని ప్రశ్నలడిగింది ఇందుకన్న మాట' అంది.

'అవును. ఎలా చెప్పాలా అని మథనపడ్డాను. నేను చెప్పకుండానే మీకు తెలిసింది.'

రేఖ మౌనంగా ఉంది.

కృష్ణమూర్తి ఆరాధనతో ఆమె ముఖంలోకి చూస్తూ 'నిజం రేఖా. ఐ లైక్ యూ' అన్నాడు.

రేఖ అతని మొహంలోకి చూసింది. ఆ చూపులో ఏ అభిప్రాయమూ లేదు. తన ప్రేమని అంగీకరిస్తుందో లేదో తేల్చుకోలేకపోయాడు కృష్ణమూర్తి.

## అనగా అనగా...

'ఇప్పుడెందుకు లెండి ఆవిషయం' అంది.

'ఎప్పుడో ఒకప్పుడు ఆలోచించుకోవలసినదేగా'

రేఖ తలవంచుకుని 'నాకు పెళ్లి గురించి ఏ అభిప్రాయమూ లేదు' అంది.

'అంటే?'

'చేసుకోవాలనిగాని చేసుకోకూడదనిగాని ఎప్పుడూ అనిపించలేదు'

'ఈ క్షణందాకా అనిపించలేదు సరే. ఇప్పుడు? నేను అడిగాక?'

రేఖకి నవ్వు వచ్చింది. 'ఇప్పుడు అలా అనిపిస్తుందని ఎందుకనుకుంటున్నారు' అంది.

'అనుకోవడం లేదు, ఆశ. అంతే. మీరు ఒప్పుకుంటారని అనిపిస్తోంది. అర్హత లేనివాణ్ణి కాను. నేనంటే మీకు సదభిప్రాయం ఉంటే ఒప్పుకోండి. నాకుమాత్రం మీరంటే ప్రాణం.'

రేఖ క్షణం ఆగి 'నేను ఆలోచించుకోవాలి' అంది.

'యస్. టేక్ యువర్ ఓన్ టైమ్. ఎప్పుడు చెబుతారు?'

'రెండు రోజుల్లో'

'ఇవాళ ఊరువెడతాను. ఎల్లుండి వస్తాను. అప్పుడు చెప్పండి. హేపీ న్యూస్ కోసం ఎదురుచూస్తుంటాను' అంటూ లేచాడు కృష్ణమూర్తి.

* * *

రేఖ తండ్రి సుదర్శనంగారు రిటైరయి ఏడాదయింది. రేఖ ఒక్కర్తే కూతురు ఆయనకి. చాలాగారాబంగా చూసుకుంటాడు ఆమెని. రేఖకి అన్ని విషయాలల్లోనూ సర్వ స్వాతంత్ర్యాలూ ఉన్నాయి. ఆమెవే నిర్ణయాలన్నీ. ఆమె పెళ్లి విషయంలో కూడా ఏమీ కల్పించుకోలేదు ఆయన.

వాళ్ళ ఇంట్లో ముందుగదిలో అద్దెకుంటున్నాడు కృష్ణమూర్తి. మూడువందల ఏభై తెచ్చుకుంటున్నాడు. ఏడాది క్రితం ఉద్యోగానికి వచ్చాడు. ఇంట్లో గదిగాని పోర్షనుగాని ఎవరికైనా ఉండటానికి ఇవ్వాలన్న ఉద్దేశం ఎప్పుడూ కనపర్చకపోయినా సుదర్శనంగారు అతనికి వెంటనే గది యిచ్చారు.

ఇచ్చినది ఇంటికి ముందుగది. చాలా సౌకర్యాలున్న గది. సీలింగ్ ఫాన్ ఉంది, గాలి, వెలుతురు చాలా బాగావస్తాయి. నీట్ ఫినిష్ ఉంది. ఆ యింటిని చూడటానికి ఎవరు వచ్చినా ఆగది తప్పకుండా చూస్తారు. ఆ గది తను సొంతం చేసుకోవాలని చూసిన వాళ్ళందరికీ అనిపించేది. ఆ గదిలో రేఖ తన వస్తువులుంచుకునేది. తండ్రి తనని అడగకుండానే ఆగది అద్దెకిచ్చాక అది ఖాళీచేసి యిచ్చింది. తన బట్టలు, పుస్తకాలు ఇంకో గదిలో అలమారలో సర్దుకుంది.

సుదర్శనంగారి చెల్లెలు సత్యవతమ్మ కొడుకు మధుతోసహా వచ్చి నెలయింది. ఇంకో నెలరోజులు ఉండాలనుకుంటున్నారు. మధుకి ఉద్యోగం అంటూ ఏమీలేదు. చెయ్యవలసిన అవసరం లేదు. చెయ్యాలన్న సంకల్పం, ఇష్టంకూడా లేవు. ఆర్టిస్టు కావాలని కోరిక ఎప్పుడూ బొమ్మలు గీస్తూ ఉంటాడు. రేఖని తన కొడుక్కి చేసుకోవాలని సత్యవతమ్మ తాపత్రయం.

* *

రేఖ లోపలికి పోబోతోంటే ఇంట్లోంచ ఒక ఇరవైఏళ్ల ఆవిడ చలుగేళ్ళ కూతుర్ని ఎత్తుకుని బయటికి వస్తోంది. ఆవిడెవరో రేఖకి తెలియదు. సత్యవతమ్మ ఆమెతో బయటికి వచ్చి 'ఇంక ఉంటాను జయమ్మగారూ' అంది.

ఆవిడ రేఖని చూపిస్తూ 'ఈ అమ్మాయి ఎవరు?' అని అడిగింది. 'మా మేనగోడలు' అంది సత్యవతమ్మ.

'ఏం చదువుతోంది?'

'బి. ఏ. మొదటి సంవత్సరం'

ఆవిడ కల్పించుకుని మాట్లాడింది రేఖతో. రేఖకి కొత్తవాళ్లతో కొంచెం ఇబ్బందిగా ఉంటుంది ఆమె ప్రశ్నలకి ముక్తసరిగా సమాధానాలు చెప్పింది. ఆవిడ తన కూతుర్ని గురించి కబుర్లుచెప్పి వెళ్ళిపోయింది.

రేఖ ఇంట్లోకి వెళ్లబోతూ మధుని చూసింది. బొమ్మలేసుకుంటున్నాడు. అటు వెళ్ళింది.

'ఇలారా. టైముకి వచ్చావు. అక్కడ కూర్చో' అన్నాడు.

'ఎందుకు?'

'బొమ్మ వేస్తాను'

'వేశావుగా ఇందాకటిసారి!' అంది సాభిప్రాయంగా.

'అప్పటికీ ఇప్పటికీ తేడాలేదంటావా?

చూస్తూగాని'

'అంతసేపు నేను కూర్చోలేను బాబూ' అంది రేఖ విసుగ్గా. ఆమెకి అప్పుడే చాలాసేపు కూర్చున్నట్లు ఉంది.

'ఎక్కువసేపు అక్కర్లేదు. ఒక్క పావు గంట చాలు!'

పావు గంటలో బొమ్మ పూర్తి కాదనీ కనీసం గంటకావాలనీ తెలుసు రేఖకి. పావు గంట అని తనని మభ్యపెట్టి 'ఇంకా అయిదు నిమిషాలు', 'ఇంకో క్షణం' అంటూ తనని ఆపేస్తాడు. ఇదివరకు రెండు మూడుసార్లు అలాగే చేశాడు. అసలు ఇప్పుడు 'మూడ్' లేదు.

'ఎంత తెలియని దాన్నయినా బొమ్మ కెంత టైము పడుతుందో తెలుసులే. నేను పోతున్నా. ఇంకెవర్నయినా పిలుచుకో' అంటూ వెళ్లబోయింది.

'ఇంకెవర్నయినా వెయ్యదలిస్తే నిన్నెందుకు పిలుస్తాను? బొమ్మ బాగుండాలని కదా'

ఆ మాట మంత్రంలా పనిచేసింది. లేవబోయిన రేఖ ఆగింది. అతను చెప్పిన ప్రదేశంలో కూర్చుంది. జడ ముందుకు వేసుకుని గడ్డంకింద చెయ్యిపెట్టుకుని విలాసంగా కూర్చోవున్నాడు. దగ్గిరకివచ్చి 'ఏంగిల్' సరిచేశాడు.

రేఖ ఓపికగా కూర్చుంది. కాసేపయిన తర్వాత 'ఒక అరగంట ఓపికగా కూర్చోవటం ఇదే మొదటిసారి' అంది.

అతను మాట్లాడలేదు. ఇంకా ఏదో అనబోతూ ఉంటే 'ష్. మాట్లాడకు' అన్నాడు. ఇంక కూర్చోలేనని గోలచేస్తోంటే మరో పావు గంటకి విముక్తి లభించింది.

బొమ్మకేసి తృప్తిగా చూస్తూ 'ఎలా ఉంది?' అన్నాడు.

'జైల్లో కూర్చున్నట్లుంది'

'అదికాదు. - బొమ్మ విషయం?'

బొమ్మకేసి చూసింది రేఖ తను లేచి వెళ్ళిపోతానని గొడవ చెయ్యడంవల్ల తొందర తొందరగా వేసేసినట్లున్నాడు. ఔట్‌లైను స్పష్టంగా ఉందిగాని డిటెయిల్స్ అన్నీ లేవు. పోలికలు కొంచెం తెలుస్తున్నాయి. కాని కంగారు పడకుండా తాపీగా వేసినాకూడా పూర్తిగా తనలా వచ్చి ఉండే దన్న నమ్మకం కలగలేదు రేఖకి.

'నా బొమ్మేనా వేసింది?' అంది వేళాకోళంగా నవ్వి.

'నేను ఉండమన్నంతసేపూ ఉండకుండా నా బొమ్మేనా వేసింది అంటే నేనేం చెప్పను? ఇంకో పావుగంట కూర్చుని ఉంటే చూపించేవాడిని నా గొప్ప' అంటూ ఉంటే 'అక్కయ్యా, అత్తయ్య పిలుస్తోంది' అంటూ వచ్చాడు రేఖ తమ్ముడు సీను.

రేఖ లోపలికి వెళ్ళిపోయింది.

* * *

'దాని సంగతి ఏం తేల్చావు?' అంది సత్యవతి సుదర్శనం గారితో.

అన్నగారి కూతురు రేఖని తన కొడుక్కి చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో ఆ విషయం ఆవిడ చాలాసార్లు కదిపింది. ఏనాడూ ఆయన చెవిని పెట్టలేదు. తన యిష్టం ఏమీ లేదనీ అంతా రేఖ యిష్టమనీ అనేవాడు. ఇక్కడ కొన్నాళ్లు ఉంటే రేఖకీ మధుకీ సాన్నిహిత్యం ఏర్పడుతుందనే ఉద్దేశంతో ఆమె కొడుకుతో సహా ఇక్కడికి వచ్చింది. సాన్నిహిత్యం అయితే ఏర్పడింది కాని ఆమె కోరుకున్న తీరులో మాత్రం కాదు. 'రేఖ తన భార్య అయితీరాలి' అన్న ఉద్దేశం మధుకి కలగలేదు. అలాగే రేఖ. తను అక్కడ వుండగానే వాళ్ళ పెళ్ళిగురించి అన్నగారిదగ్గర మాట తీసుకోవాలని ఆవిడ తాపత్రయం.

'దేని సంగతి?' అన్నారు సుదర్శనం గారు.

'రేఖ పెళ్ళి సంగతి.'

'మొద్దారలే. ఏం తొందరొచ్చింది?' అన్నారాయన.

పెళ్ళి చెయ్యడానికి తొందర లేదనే మాట అనుకుంటే పెళ్ళి ఎప్పుడయినా చెయ్యవచ్చని అందావిడ.

'దాని ఇష్టం. అది ఎవరిని చేసుకుంటానంటే వాళ్ళకే ఇచ్చి చేస్తాను' అన్నారాయన.


'దాని మొహం. దానికేం తెలుస్తుంది? పెద్దవాళ్లం మనం ఒకటి ఖాయం చేస్తే అదే తల వొగ్గుతుంది.'

ఆయన నవ్వేసి ఊరుకున్నాడు. అంటే తను ఎదుటి వాళ్ళ మాట వినదలుచుకోలేదని అర్థం.

ఆవిడ ఊరుకోదల్చుకో లేదు. 'తొందరేమిటంటావు గాని అన్నయ్యా ఆడదాని పెళ్లికి కాకపోతే ఇంక దేనికీ తొందర? ఎప్పుడు వీలుపడితే అప్పుడు చేసెయ్యాలి గాని' అంటూ ఉండగానే రేఖ లోపలికి ప్రవేశించింది.

వస్తూనే గ్రహించింది రేఖ వాళ్ళు మాట్లాడుకునేది తన పెళ్ళి సంగతేనని. అందుకే 'ఎందుకు పిలిచావు అత్తయ్యా' అని అడగలేదు. సత్యవతి అయినా ఇదివరలో తను రేఖ పెళ్ళి ప్రసక్తి ఎప్పుడు తీసుకు వచ్చినా అన్న సుదర్శనంగారితోనే మాట్లాడింది గాని రేఖని మాటవరసకైనా అడగ లేదు. కాదంటుందని భయం.

అయితే ఆవిడ సుదర్శనం గారి మీద



పత్తిడి తీసుకొస్తూనే ఉంది. రేఖ అక్కడే వున్నా ఆవిడ సుదర్శనం గారితో మాట్లాడింది. అయినవాళ్లంటున్నానే పిల్లనిస్తే ఆస్తి అస్తిలోనే ఉంటుందనీ, మధుకి ఏ లోటూ లేదని, నిక్షేపంలా బోలెడంత ఆస్తి ఉందనీ, ఉద్యోగం చెయ్యకపోయినా ఫరవాలేదనీ అంది.

రేఖ డోర్ కర్టెన్ అటూ యిటూ కదుపుతూ కూర్చుంది.

మాట వినకపోవడంలో తండ్రీ కూతురూ ఒకటే. తమ కిష్టంలేనిమాట ఇద్దరిలో ఏ ఒకరూ వినరు. చెప్పి చెప్పి, తన నోరు నొప్పి పుట్టడమే తప్ప వాళ్ళు వినరు, విన్నా పట్టించుకోరని తెలిసికూడా ఆవిడ నచ్చచెబుతూనే వుంటుంది.

రేఖకి ఆమాటలు విన్నాక బాగా కోపం వచ్చింది. అది మధుమీదికి మళ్ళింది. చరచర తోటలోకి వెళ్లింది.

'అప్పుడే వచ్చేశావా? గుడ్. ఇంకో పొజిషన్‌లో కూర్చో. ఈమాటు బాగా వేస్తాను' అన్నాడు ముందు వేసిన బొమ్మ కేసి పరీక్షగా చూస్తూ.

రేఖ కూర్చోలేదు. 'అత్తయ్య నన్నెందుకు పిలిచిందో తెలుసా?' అంది విసురుగా.

అతను ఈజెల్ ముందు నిలబడి తృప్తిగా బొమ్మకేసి చూసుకుంటూ 'ఎందుకు?' అన్నాడు.

'నిన్ను పెళ్ళి చేసుకోమని అడగడానికి.'

బ్రష్ తీసుకుని జుట్టుకి నలుపు దిద్దుతూ 'అడిగిందా?' అన్నాడు.

'ఆ చేసుకోనన్నాను' అందిరేఖ కోపంగా.

'ఎవరిని?' అన్నాడు మధు బొమ్మకి కళ్ళు జాగ్రత్తగా దిద్దుతూ.

ఈ పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉంది రేఖకి. మాట వినిపించుకోనివాడిని ఎలా బాధ పెట్టగలదు?

'ఎవరి నేమిటి? నిన్నే

'ఈ పన్ను...?' అంటుండగా అతని కేదో చటుక్కున స్ఫురించి బ్రష్ తీసుకుని ఒక చిన్నగీత కలిపాడు. మళ్ళీ దూరంగా జరిగి తృప్తిగా చూసి 'రేఖా ఇలా రా. కళ్ళు అచ్చు నీ కళ్ళలా లాలేదూ?' అన్నాడు.

ఉడికిపోయినట్టు చూసి 'ఏమీ లాలేదు' అని వెళ్ళిపోబోయింది విసురుగా.

అప్పటికి చలనం వచ్చింది మధులో. తను అన్నమాట వినడంలేదని ఆమెకి

# అనగా అనగా...

కోపం వచ్చిందని తెలుసుకుని కంగారుగా బ్రష్ అక్కడ పారేసి 'ఆగు రేఖా, ఏదో చెబుతున్నావు? ఏమిటి? మళ్ళీ చెప్పు' అన్నాడు.

'ఏమీలేదు' అంది రేఖ మామూలుగా.

'పోనీలే. ఇటు చూడు మళ్ళీ. బొమ్మ నిజంగా బాగాలేదా?' అన్నాడు. ఆ కళ్ళల్లో బాధ స్పష్టంగా కనిపిస్తోంది.

రేఖ సమాధానపడి బొమ్మని పరీక్షగా చూసింది. నిజంగా బాగా కుదిరింది. 'బాగానే ఉంది' అనేసి వెళ్ళిపోయింది.

* * *

కృష్ణమూర్తికి మాట యిచ్చిందే కాని రేఖకి తన పెళ్ళి విషయం ఏమీ ఆలోచించ బుద్ధి కాలేదు. అయితే తన పెళ్లికి తొందరేం వచ్చింది? అనుకోలేదు. ఎందుకంటే అత్తయ్య తన పెళ్ళి విషయం చాలాసార్లు కదపడం ద్వారా తను పెళ్ళీడుకి వచ్చినదాన్ని అన్న విషయం రేఖ మనసులో బాగా నాటింది. అందరు ఆడపిల్లల్లాగానే రేఖ కూడా 'ఆ వచ్చేవాడి'ని మనసులోనే ఊహించుకుంది. పొడుగాటి శరీరం, అందమైన ముఖం, నడకలో చూపులో హుందాతనం, డబ్బు ధారాళంగా ఖర్చుపెట్టడం ఇవన్నీ మనసులోకి వచ్చాయి. ఒక చక్కటి రూపం మనసులో ప్రతిష్ఠించుకుంది. పేరు కూడా ఆలోచించుకుంది. సుధీర్ ఆమెకి నచ్చిన పేరు. అలా ఆలోచించుకున్న తర్వాత ఎవర్ని చూసినా నచ్చటం లేదు. అలా ఆలోచించడం పొరపాటని తొందరలోనే గ్రహించింది రేఖ. కలల్లో బతకడం తాత్కాలికానందం కోసమేనని నిర్ణయాలు తీసుకునేటప్పుడు వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకోవాలని నిర్ణయించుకుంది.

రెండురోజులూ ఏమీ ఆలోచించకుండానే రేఖ గడిపేసింది.

ఆ రోజు కృష్ణమూర్తి వస్తాడనగా మధ్యాన్నం రేఖా, మధు కలిసి బట్టల షాపుకి వెళ్లారు. చాలా రకాల చీరలనుంచి ఒకటి ఏరుకుంది రేఖ.

ఇద్దరూ కలిసి బస్సు ఎక్కారు? మధు దారిలోనే దిగాడు ఏవో బ్రష్షులు కొనాలంటూ ఇంకో బస్సులో వస్తానన్నాడు.

బస్సులో ఉన్నంతసేపూ రేఖకి ఒకటే ఆలోచన, కృష్ణమూర్తికి ఏం చెప్పాలి? తను ఇవాళ ఏదో విషయం చెబుతానంది. తను ఏ విషయం చెప్పలేదు.

కృష్ణమూర్తికి ఆ గది అద్దెకి ఇచ్చే ఉద్దేశం నాన్నకి ఆ ఉద్దేశం ఉండి ఉండలి. లేకపోతే అసలు ఇల్లు అద్దెకి ఇవ్వకూడదనుకున్న మనిషి అతనికి రూము ప్రత్యేకంగా ఖాళీ చేయించి ఇవ్వరు. అదీకాక అత్తయ్య ఎవరినైనా అద్దెకి చేర్చుకుంటే కాస్త కాలక్షేపం అవుతుందని ఒకసారి సలహా ఇచ్చింది. ఆ సలహా నచ్చింది. అందు గదితోపాటు మరో రెండుగదులు కలిసి ఒక ఫామిలీ పోర్షనుగా ఇద్దామనుకున్నారు. ఒక గది విడిగా ఎవరైనా చదువుకొనే, లేక ఉద్యోగం చేసుకొనే కుర్రవాళ్లకి ఇద్దామన్న ఉద్దేశం లేదు. అద్దెకంటూ ఇవ్వవలసిన అవసరం లేకపోయినా ఒక ఉద్దేశం ఏదో మనసులో పెట్టుకుని నాన్న అతనికి రూము ఇచ్చారు.

కృష్ణమూర్తి చదువుకున్నవాడు, అనాకారి కాడు. మంచి ఉద్యోగం చేస్తున్నాడు. ఎవరైనా అంతకంటే కోరదగినది ఏమీ ఉండదు. నాన్నకి కూడా ఇష్టమైన వ్యక్తి.

రేఖ కృష్ణమూర్తిని పెళ్లిచేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చేసింది. అలా నిర్ణయించుకున్న తర్వాత కృష్ణమూర్తి చాలా ఉన్నతంగా కనబడ్డాడు. అతనిలో ఏదో ప్రత్యేకత తోచింది. రేఖకి సిగ్గు వేసింది. 'అతనితో ఇదివరకటిలా మాట్లాడగలనా?' అనుకుంది. తనని కృష్ణమూర్తిని పక్కపక్కన ఊహించుకుంది.

బస్సు స్టాండులో ఆగింది.

రేఖ బస్సు దిగుతూంటే పొరపాటున ఆమె కాలు ఒక బూటుకాలుమీద పడింది. వెంటనే తీసేసి 'అయామ్ సారీ' అంది.

'ఐ క్ అయామ్ హేపీ' అంది అవతల కంఠం.

రేఖ సంభ్రమంతో తలెత్తి చూసింది. పరిచయంలేని కొత్త ఆడపిల్లతో చమత్కరించగల ఈ మొనగాడెవరా అనుకుంటూ చూసింది.

చూసి ముగ్ధురాలయిపోయింది.

ఎదుట కనిపించిన వ్యక్తి చాలా అందగాడు. పొడుగాటి విగ్రహం, తెల్ల పాంటు, తెల్లషర్టు ఇన్షర్టు చేసుకున్నాడు. చిన్నగా నవ్వుతున్నాడు నవ్వితే బుగ్గ మీద అందమైన చారపడుతోంది. ఒకసారి చూస్తే కళ్లు తిప్పుకోలేని రూపం అతనిది.

రేఖ కనురెప్పలు బరువుగా కిందికి దిగాయి. ఆహ్లాదకరమైన ఆలోచనలు మనసులో చోటుచేసుకున్నాయి. తలదించుకుని ముందుకి నడిచింది. ఎదురుగా ఉంటే 'చూడండి' అని వినపడింది.

రేఖ చూడలేదు. ఆగింది.

'మీ జేబురుమాలు' అన్నాడు. అందుకుని ముందుకి నడిచి 'థాంక్స్ చెప్పలేదే' అని వెనక్కి తిరిగిచూసింది. అతనక్కడే వున్నాడు. 'థాంక్స్' అని ముందుకు నడిచింది. ఇంకోసారి చూడాలని తీవ్రమైన కోరిక ఉన్నా చూడలేదు.

సందు చివరదాకా వెళ్ళి అక్కడ మలుపు తిరుగుతూ ఒక్క క్షణం కళ్ళు యిటు తిప్పింది. అతను కనబడలేదు.

* * *

రేఖ బస్సులో చేసుకున్న నిర్ణయం గాలికెగిరిపోయింది. 'ఇంకా నయం. కాస్త ఉంటే ఒప్పేసుకుని ఉండేదాన్ని' అనుకుంది. కళ్ళు తెరిచినా మూసినా అతని రూపం కళ్ళ ముందు కనిపిస్తోంది. 'మగవాళ్ళు అంత అందంగా ఉండటం సాధ్యమా ?' అనిపిస్తోంది.

కృష్ణమూర్తి అప్పటికే వచ్చాడు. రేఖ కావాలని అతన్ని తప్పించుకు తిరిగింది. మర్నాడు తోటలో తారసపడ్డాడు. ఏమి మాట్లాడాలో తెలియక ఇబ్బంది పడింది.

'రండి, అలా గడ్డిలో కూర్చుందాం' అన్నాడతను.

'నాన్న ఎందుకో పిలిచారు నన్ను' అంది రేఖ బొటనవేలితో నేలని రాస్తూ.

కృష్ణమూర్తి ఆమెని పరీక్షగా చూసి 'మీ నిర్ణయం నాకు చెప్పలేదు' అన్నాడు.

రేఖ మాట్లాడలేదు. తల దించుకుంది.

అతను సిగరెట్ వెలిగించాడు. 'చూడండి మీనిర్ణయం నిన్ననే గ్రహించాను. నిర్మొహమాటంగా మాట్లాడుకుందాం. మూడు రోజులనాటికీ ఇవాళ్టికీ మీలో ఇంత తేడా ఎందుకు వచ్చింది?' అన్నాడు.

రేఖ కళ్ళు మూసుకుంది. ఈ పరిస్థితి తప్పితే చాలనుకుంది.

అతను బాధగా నవ్వాడు. 'సారీ. మనసు ఉండబట్టలేక అడిగాను. మీరు వెళ్ళండి. మీ నాన్నగారు పిలుస్తున్నా రన్నారుగా' అన్నాడు.

ఆమె నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వెనక్కి తిరిగి వెళ్ళిపోయింది.

(ముగింపు పెవారం)





ఉత్సాహవంతులుకండి... లాలిత్యం పొందండి...
రోజంతా శోభ చేకూర్చుకోండి !


మీకు రోజంతా శోభ చేకూర్చుటలో సహాయపడే చార్మిస్ టాల్క్‌తో, చల్లగా సేదదేరి ఉండండి. చార్మిస్ యొక్క ఆనందప్రదమైన పరిమళం మిమ్మల్ని సేదదేర్చుటలో ఇంద్రజాలములా పని చేస్తుంది... మిమ్మల్ని ఉత్సాహవంతుల్ని చేస్తుంది. శోభాయమానమైన లావణ్యం మీకు చేకూర్చుతుంది.




చార్మిస్
టాల్కమ్ పౌడరు
ఆనందప్రదమైన
వాసన కలిగి యున్నది

HTP.G.17 Te

## పెద్దకథ:



# అనగా అనగా ఒక అమ్మాయి

కాశీనాథ్ & కాశీనాథ్

(గత సంచిక తరువాయి)

ఇంటి దగ్గిరనుండి ఏదో టెలిగ్రాం వచ్చిందని చెప్పి వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి. రెండు రోజుల తర్వాత రేఖ ఇంట్లో లేని టైము చూసుకుని వచ్చి సుదర్శనంగారితో రూము ఖాళీ చేస్తున్నానని చెప్పాడు. ఎందుకని అడిగితే రెండు నెలలు మెడికల్ లీవు పెట్టానని అన్నాడు.

'మెడికల్ లీవా ? వంట్లో బాగాలేదా?'

'బాగానే ఉందండి.'

'మరి దేనికి ?'

'మా అమ్మకి బాగాలేదు' అన్నాడు.

సుదర్శనంగారు చాలా బాధపడ్డారు. ఓదార్పు మాటలు చెప్పారు గని అతను ధైర్యంగానే ఉన్నట్లు గమనించారు. ఓదార్పు అంతగా అవసరం లేకపోయింది.

'అమ్మాయి వస్తుంది కాసేపట్లో' అన్నారు.

'లేదండి. నాకు టైమయింది వెళ్ళాలి' అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు.

ఆయన రేఖ రాగానే విషయం చెప్పారు. రేఖ ముభావంగానే వింది. లోలోపల బాధ పడింది.

రేఖకి ఈ రెండు రోజుల్లో మత్తు

దిగిపోయింది. తను కృష్ణమూర్తిని పోగొట్టుకోవడం ఎంత దురదృష్టమో తెలుసుకుంది. ఒక్కసారి ఒక్క క్షణం చూసిన వ్యక్తిమీద పెళ్ళికి ఆశలు పెంచుకుంది; మళ్ళీ కనిపిస్తాడని కూడా హామీ లేని వ్యక్తిని ప్రేమించి, చేతికందిన రత్నాన్ని కాలదన్నుకుంది.

'ఏమిటమ్మా అంత హఠాత్తుగా ఖాళీ చేసేశాడు? నువ్వు వస్తావు ఉండమన్నా ఉండలేదు.'

'ఏమో నాన్నా' అంది తెలిసీ కూడా.

'జబ్బు లేదంటాడు. అయినా రెండు నెలలు సెలవు పెట్టాడుట.'

రేఖ ఆశ్చర్యంగా తలెత్తి చూసింది.

'వాళ్ళమ్మకి ఒంట్లో బాగాలేదుట. అహర్నిశలూ తను వాళ్ళతో ఉండాలన్నాడు.'

రేఖ అర్థం అయినట్లు తల దించుకుంది.

'నువ్వు చెప్పరాదుటే.'

'ఏమని ?'

'ఇక్కడే ఉండమని.'

'ఆయన ఉండరు నాన్నా'

'ఎందుకుండడు ? వాళ్ళమ్మని ఇక్కడికే తీసుకు రావచ్చుగదా.'

'లేదు నాన్నా. ఆయన ట్రాన్సఫర్ కోసం సెలవు పెట్టారు'

'నీకెలా తెలుసే. వాళ్ళమ్మ అనారోగ్యం కోసం అని స్పష్టంగా చెబితే'

'వాళ్ళమ్మ చాలాకాలం క్రితం చచ్చిపోయింది నాన్నా' అంది రేఖ.

* * *

పోగొట్టుకున్న దాన్ని గురించి విచారిస్తూ కూర్చుంటే మనసుకి విశ్రాంతి, స్థిమితం ఉండవు. రేఖ దృష్టి మళ్ళీ అతనిమీదకే మళ్ళింది. ఒక్కసారి ఒక్క క్షణం చూసిన వ్యక్తిని మనసులో నింపుకోవడానికి ప్రయత్నించింది. కాని పూర్తిగా సాధ్యం కాలేదు.

కృష్ణమూర్తిగది ఖాళీ అయినదాన్ని అలాగే ఖాళీగా ఉంచింది రేఖ. రెండు రోజులు బరువుగా గడిచాయి. సంతోషమూ, బాధా లేనిస్థితి. రానున్నదానికి ఆశపడాలో, పోగొట్టుకున్న దానికి బాధపడాలో తెలియని స్థితి.

కృష్ణమూర్తి గుర్తుకు వచ్చినప్పుడల్లా ఎంత బాధపడి ఉంటాడో అని పించేది రేఖకి. కాని అంతలోనే మనసు 'అతని'మీదకి పోయేది. కళ్ళముందు అతని అందం కదలాడేది.

అయితే రోజులు గడుస్తున్న కొద్దీ ఊహలు విహరించడం మానేశాయి. వాస్తవిక దృష్టి వచ్చింది. అతను మళ్ళీ కనిపించలేదు. అసలు అలాంటి మనిషిని నిజంగా చూశానా, భ్రమా అని అనుమానం రాసాగింది ఆమెకి.

ఖాళీ అయిన ముందుగదిని 'మధు'ని తీసుకోమంది రేఖ. అతను సంతోషంగా తీసుకున్నాడు. బంగళా ముందువరండాకి ఉత్తరంగా ఉంది ఆ గది. గాలి వెలుతురూ బాగా వచ్చే ఆ గదిని తీసుకోమనగానే మధుకి చాలా సంతోషం కలిగింది. సత్యవతమ్మకి కూడా చాలా సంతోషం కలిగింది. తనకి ఎప్పుడు అయితేనేగాని రేఖ ఆగది ఎవరికీ ఇవ్వదని ఆమెకి తెలుసు. కృష్ణమూర్తి అర్థాంతరంగా ఖాళీ చెయ్యడం ఆమె గమనించింది. ఏముయి ఉండవచ్చునో ఊహించింది.

మధు తన సామానంతా ఆ గదిలోకి మార్చుకున్నాడు. రేఖకి కూడా ఆగదిలో అతనికి అర్హత కనిపించింది.

* * *

తోటలో ఒంటరిగా కూర్చోవటం ఇది వరకు చాలా యిష్టం రేఖకి. ఇప్పుడు నచ్చటం లేదు. అందుకే మధు ఏం చేస్తున్నాడోనని అటు వెళ్ళింది.

మధు జయమ్మగారి పాపని కూర్చోబెట్టుకుని బొమ్మ గీస్తున్నాడు.

'ఎవరీ అమ్మాయి?' అంది రేఖ

'కనుక్కో లేదు. అడుగుతానుండు' అన్నాడు.

రేఖకి నవ్వు వచ్చింది. 'ఎవరో తెలియకుండా కూర్చోబెట్టి బొమ్మ గీస్తున్నావన్నమాట' అంది.

'ఇటు వచ్చింది. ఒక బిస్కట్టు పెట్టి ఇక్కడ కూర్చోమన్నాను కూర్చుంది. బొమ్మ మొదలు పెడుతుండగానే బిస్కట్టు అయిపోయింది. కదిలిపోతోంటే ఇంకో బిస్కట్టు ఇచ్చాను. అలా ఇప్పటికి ఎనిమిది బిస్కట్లు ఇచ్చాను. ఇంక రెండున్నాయి. అవి అయేలోగా బొమ్మ పూర్తి చెయ్యాలి.' అన్నాడు.

రేఖ అతని ముందుకొచ్చి బొమ్మ చూసింది. చాలా గందరగోళంగా ఉంది. ఏడెనిమిదిరుంది అమ్మాయిం బొమ్మలు ఒకదానిమీద ఒకటి ఉన్నాయి.

'ఏం చెయ్యను? ఒక్కొక్క బిస్కట్టు పెట్టినప్పుడల్లా ఒక్కొక్క పోజులో కూర్చుంటోంది. అన్ని పోజులూ గీసేశాను' అన్నాడు.

ఇంతలో 'రాధా' అన్న పిలుపు వినపడింది. రెండు క్షణాల్లో 'ఇక్కడున్నావుటే' అంటూ జయమ్మ వచ్చింది.

'మీ అమ్మాయా?' అంది రేఖ.

'అవునం'ది జయమ్మ.

జయమ్మకి ఇరవై రెండేళ్ళుంటాయి. అందగత్తె కాదు. చాలా మామూలు స్త్రీ. చక చక మాట్లాడే చాతుర్యం ఒక్కటే ఆమెకి అలంకారం. అ ఏడేళ్ళ రాధది తల్లి పోలిక కాదు. రాధ అందాల బొమ్మ.

జయమ్మ చాలా చలాకీ మనిషి. కలుపుగోరు స్వభావం కలది. అందుకే ఆమె తనకంటే చాలా పెద్దదయిన సత్యవతమ్మతో మాటలు కలుపుకుంది. రేఖతో కూడా మాటలు కలుపుకోవాలని చూసింది. కాని అవకాశం దొరకలేదు. ఇప్పుడు క్షణాల మీద మాటలు కలిపేసింది జయమ్మ. ఉన్న అయిదు నిమిషాల్లో చాలా విషయాలు చెప్పింది. ఈ మధ్యనే ఇక్కడికి ట్రాన్స్ఫర్ అయింది వాళ్ళకి. ఇల్లు మంచిది దొరకలేదు నాలుగుసందుల అవతల ఒక ఇల్లు మాట్లాడుకుని ఉంటున్నారుగాని అది నచ్చలేదు రేఖా వాళ్ళ ఇంట్లో ఒక వాటా ఖాళీగా ఉందని విని కనుక్కోవడానికి వచ్చింది.

'లేదండి ఖాళీ అయినవాటా నిజమేగాని ఒకగదిలో మా బావ ఉంటున్నాడు. వాళ్ళు ఇంకో నెలాళ్ళు ఉంటారు. ఆతర్వాతైతే ఇస్తాం' అంది. ఆవిడ ఒప్పుకుంది. ఇల్లు బాగా నచ్చింది ఆవిడకి.

ఆవిడ వెళ్ళిపోతోంటే మధు రేఖకి దగ్గరగా వచ్చి చెవిలో 'ఆ పాపని ఇక్కడ ఉంచి వెళ్ళమను' అన్నాడు.

'నువ్వే అడుగు'

'అమ్మో ..నువ్వే అడుగు'

'ఎందుకూ బొమ్మ వేసుకోవడానికేగా'

'ఆ'

'నేనడగను'

'ఎలా మరి ?'

## గేయాల రచయితలకి
## మనవి

ఆంధ్రసచిత్రవారపత్రికకి గేయాలు పంపేవారు వీలయినంతవరకూ 15 పంక్తులు మించనివి పంపగోరుతాము.

—సంపాదకుడు.



**దీర్ఘ రోగులకు**
**ఉత్తమ వైద్యము**

నపుంసకత్వము, శుక్ల నష్టము, హస్తప్రయోగము, అసంతృప్తి, ఉబ్బసము, (దమ్ము), గోధ కాళ్ళు, చెవుడు, కడుపునొప్పి, కుష్ఠు, గజ్జి, చర్మ వ్యాధులకు పోస్టలు ద్వారా కూడా వైద్యము చేయబడును

**శ్రీ బాలాజీ వైద్యశాల.** డా: పి. కుమారస్వామి దేవర · ట. బి రోడ్, తెనాలి. ఫోన్ 551.
బ్రాంచి 9—డ, శివాజీ స్ట్రీట్, మద్రాసు—17.

**రేడియో రు 15/— మాత్రమే**



మా నవీనపథకం ద్వారా బ్యాటరీ సెల్సుతో పని చేసే ప్యాకెట్ ట్రాన్సిస్టర్ పొందండి. జపాన్ తయారి. ప్రపంచంలో ఎక్కడైనా స్థానికంగా సంగీతం, వార్తలు వగైరా వినండి. పోస్టేజి రు. 3. వి.పి. పార్సిల్ ద్వారా పంపబడును. వెంటనే వ్రాయండి. తృప్తికరముగా లేనిచో ధర వాపసు

BUNTY RADIOS (B-19)
Durgiana, Amritsar.

## 'సంతానంలేదా?'
**వెంటనే సంప్రదించండి**
**బాక్సు నెం. W/128**
**7, ఆంధ్ర సచిత్ర వార పత్రిక**
**తంబుచెట్టివీధి, మద్రాసు-1.**

# అనగా అనగా...

'నేను కూర్చుంటాలే, నా బొమ్మ వెయ్యి'

మధు మొహం వికసించింది. 'నిజం! అయితే అలా కూర్చో. అట్టేసేపు బాధ పెట్టనులే' అన్నాడు.

రేఖ బుద్ధిగా కూర్చుంది.

బొమ్మ వెయ్యడానికి గంట పట్టింది. చాలా బాగా కుదిరింది. దాదాపు తనే అక్కడ కూర్చున్నట్టుంది.

రేఖ విస్మయంతో చూసింది. చాలా బాగా వేశావే' అంది. హఠాత్తుగా బావ మీద గౌరవం పెరిగింది.

మధు కాలరు సరిచేసుకున్నాడు. 'నాదేముంది, మనిషి ఎలా ఉంటే అలా వేస్తాను. నువ్వు అందంగా ఉన్నావు కాబట్టి బొమ్మ కూడా అందంగా వచ్చింది' అన్నాడు.

'ఎలా ఉంటే అలా వెయ్యడమే గొప్ప. నువ్వు అందర్నీ ఇలాగే వెయ్యగలవా? నన్నేనా?'

'నీకూ మిగతా వాళ్ళకీ తేడా ఏమిటి?'

'నన్ను రోజూ చూస్తున్నావుగా'

'అవుననుకో' ఆ తేడా ఉంటుంది. అయినా బయటివాళ్ళని కూడా వెయ్యగలను'

రేఖ కళ్ళముందు ఆనాటి అందగాడు కనిపిస్తున్నాడు.

'అతని' బొమ్మ తను వెయ్యగలిగితే ఎంత బాగుంటుంది!

'కొత్తమనిషిని వెయ్యాలంటే ఎంతసేపు చూడాలి?'

'బొమ్మ వేసేవాళ్ళ పరిశీలనా శక్తిమీద ఆధారపడి ఉంటుంది'

'నీ సంగతి? ఒకటి రెండు నిమిషాలు చూసినా వెయ్యగలవా?'

'కష్టం. బాగా రాదేమో. ఎప్పుడూ ప్రయత్నించలేదు. బాగా పెద్ద ఆర్టిస్టులు వెయ్యగలరనుకుంటా. లైన్ డ్రాయింగ్స్ వేసేవాళ్ళు వెయ్యగలరేమో! నేను చాలా పోలిక తేగలననుకుంటున్నాను.'

రేఖ ఉత్సాహంగా చూసింది 'నాకు నేర్పుతావా?' అంది

మధుకూడా ఉత్సాహం చూపించాడు. 'నేర్చుకుంటావా నిజంగా?' అన్నాడు.

'అదేగా అడుగుతూంటె. ఎన్నాళ్ళు పడుతుంది నేర్చుకోవడానికి?'

'పెర్ఫెక్షన్ రావడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది. ఒకమాదిరిగా వెయ్యడానికి బాగా చెప్పేవాళ్ళుంటే కొన్నినెలలు చాలు'

రేఖని నిరుత్సాహం ఆవరించింది. 'అన్నాళ్ళు నువ్విక్కడ ఉంటావా మరి?' అంది.

'అవును. అది ఒక సమస్యే. మా వూరికి పోదాం అంటోంది అమ్మ. పొలం సంగతులు నేనే చూడాలిట. నాకు అవంటే విసుగు' అన్నాడు మధు ఇబ్బందిగా చూస్తూ.

మధుకి చాలాకాలం ఉండటం వీలుపడదు, అతను ఉన్నన్నాళ్ళు నేర్చుకుంటే చాలదు. మధ్యలో వదిలేస్తే ప్రయోజనం ఉండదు.

రేఖ ఆ ఉద్దేశాన్ని విరమించుకుంది.

* * *

నెలరోజులు గడిచి పోయాయి. 'అతన్ని' చాలావరకూ మరిచిపోయింది రేఖ. బావ మీద గౌరవం, అభిమానం ఏర్పడ్డాయి.

ఈ నెలలోనూ రేఖ పెళ్ళి ప్రసక్తి చాలాసార్లు వచ్చింది. కొన్నాళ్ళ సత్యవతి అన్నయ్యతో పోరగా అమ్మాయికి పెళ్ళి చెయ్యాలన్న విషయం బాగా నాటింది ఆయన మనసులో. తర్వాత ఆయన రేఖని అడగటం మొదలుపెట్టాడు. కొన్నాళ్ళు రేఖ ఆ విషయం తప్పించేసింది. ఆ విషయం తండ్రి తనతో మాట్లాడటం ఇష్టం లేదు. ఆయన ఆ ప్రస్తావన తెచ్చినప్పుడు 'ఇప్పుడు తొందర దేనికి' అంటూ వచ్చింది.

మధుని చేసుకోవడానికి అభ్యంతరం ఏమిటని అడిగాడు ఆయన. అభ్యంతరం ఏమీ లేదు. నిజానికి అతనంటే తనకిష్టం కూడాను.

రేఖ తండ్రికేమీ సమాధానం చెప్పలేదు. ఆ తర్వాత ఆయన అడగలేదు. అత్తయ్య అసలు అడగటంలేదు.

అత్తయ్య పెళ్ళిగురించి ఒత్తిడి చెయ్యడం మానేశాక ఆ విషయం గురించి ఆలోచించ బుద్ధయింది రేఖకి. అత్తయ్య చెప్పిందని కాక తనంతట తను ఆలోచిస్తే 'అతనికేం తక్కువ?' అనిపిస్తోంది.

రేఖ ఆలోచనలు పెళ్ళివైపు మళ్ళ

డానికి చాలావరకు కారణం జయమ్మ. ఆనాటి పరిచయం పురస్కరించుకుని ఆమె తరచు వస్తూనే ఉంది. మాట చాతుర్యం, స్నేహశీలత ఉన్న మనిషి కాబట్టి తన విషయం ఎక్కువగా మాట్లాడేది. తనకి సంబంధించిన వాళ్ళలో ఒక్కరి బాధ గురించే మాట్లాడేది.

ఆవిడకి ఎక్కువగా ఇక్కడికి రావాలని ఉండేది కాని వీలుపడేది కాదు: ఆవిడ వచ్చినప్పుడల్లా రేఖకి పని తగిలేది, ఆవిడ వచ్చిన వెంటనే వాళ్ళ పాపని తీసుకురమ్మనే వాడు మధు. అందంగా ఆ పాపకి ఇవ్వడానికి బిస్కెట్లు, చాక్లెట్లు తెచ్చి రేఖకి ఇచ్చేవాడు. అతడు చూస్తూ ఉండగానే నగుమొహంగా చాక్లెట్లు తినేసేది రేఖ. ఏమీ చెయ్యలేక నిలబడి రేఖ ఒక్కొక్కటి తింటున్నప్పుడల్లా 'ఊఁ ఇంక పాపని తీసుకురా' అనేవాడు. 'ఆగు' అంటూ ఇంకోటి నోట్లో వేసుకునేది. చివరికెలా గైతేనేం తీసుకు వచ్చేది. తీసుకు వచ్చే ముందు ఆవిడ రేఖని ఆపి ఏవేవో అడిగి మాట్లాడేది. మొదట్లో బాగుండదని వినేది. తర్వాత వినడానికి బాగానే ఉండేది. తను రాగానే రాధని రేఖ ఎందుకు తీసుకు వెడుతోందో తెలియగానే జయమ్మ 'అక్కిస్తు బావగారికి సహాయం చేస్తున్నా వన్నమాట' అని, 'ఇప్పటినుంచీ పనులు చేయించుకుంటున్నట్లున్నారే మీ బావగారు?' అని ఇలా అంటుండేది. ఆరకం సంభాషణ రేఖకి సామాన్యంగా నచ్చదు, కాని ఇప్పుడు ఎందుకో వినాలనిపిస్తోంది.

ఒక విషయం పదేపదే చెప్పి ఎదుటి మనస్సులో దానికి ప్రాముఖ్యం కల్పించడాన్ని 'డైరెక్ట్ సజెషన్' అంటారు. సత్యవతి, తండ్రి, జయమ్మ ఇందరు అనగా అనగా వాటి ప్రభావం రేఖమీద బాగా పని చేసింది. మధుని చూస్తే ఇదివరకటిలా ఫ్రీగా ఉండటంలేదు. ఆడదాన్ని అన్న విషయం గుర్తుకు వస్తోంది.

ఆమె ఊహల్లో మధు చోటు చేసుకోవడానికి కొంత కారణం కాలం. ఏ స్వర్గాన్ని ఊహించుకుని కృష్ణమూర్తిని తిరస్కరించిందో, ఆ స్వర్గం దగ్గరకి వచ్చే అవకాశం లేదని తెలుసుకొంటూంటే, ఆ వ్యక్తి మళ్ళీ తటస్థపడక అతని ప్రాధాన్యత తగ్గుతోంటే అక్కడ మధుకి చోటు


# ఋతుక్రమం ఆలస్యమైతే ?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన "దేవిపిల్సు" వాడండి

'దేవి పిల్సు ముఖ్యంగా ఆలస్యమైన, క్రమముగాకాక పోయిన, బాధతోకూడిన, లేక ఆగిపోయినబహిష్టకుదేవిపిల్సు బాగుగ గుణమిచ్చును




ప్రతిచోటదొరకును

1 అన్నిసందర్భములలోను శీఘ్రముగాను, అమోఘముగాను పనిచేయును ...
2 ఏస్థితిలోను ఆరోగ్యమునకు ఎట్టిహాని కలిగింపదు

FULL COURSE 28 TABLETS Rs 11/-
HALF COURSE 14 TABLETS Rs 6/50

Mfrs:- SEENU & Co., MADRAS-81

Available at all leading Chemists & Druggists.



# పుష్టిగల ఆహారం ముఖ్యం

## ఆనందాన్ని అందించి అలరించేందుకు

మీరు తీసుకునే ఆహారానికి నిండుదనాన్ని ఇస్తుంది ఆల్ఫా-సాంగ్! కాల్షియం, ఫాస్ఫేట్లు, ఖనిజములు, ఇంకా అవుసరమైన పుష్టికర పదార్థాలు మాత్రమేగాక, శక్తివంతమైన భారతీయ ఓషధులతో పరిపూర్ణమైనది ఆల్ఫా-సాంగ్! చక్కని ఆరోగ్యాన్ని యిచ్చే ఆదర్శప్రాయమైన టానిక్! ఎదిగే పిల్లలకు, పిల్లల తల్లులకు, వయసు మళ్ళిన పెద్దలకు, కుటుంబాలలోని అందరికీ ఆవశ్యకమైన టానిక్!

మీరు నిత్యం తీసుకునే ఆహారాన్ని శక్తివంతం జేసి, జీర్ణశక్తిని ఎక్కువ జేస్తుంది ఆల్ఫా-సాంగ్! ఆహార సారాన్ని వంటికి పట్టేటట్లు జేస్తుంది! నరాల ఉద్రిక్తతను తగ్గిస్తుంది కూడా!

చూర్ణంగాను, బిళ్లలుగాను లభిస్తుంది ఆల్ఫా-సాంగ్. బిళ్లలు చక్కెర లేనివి గనుక, మధుమేహరోగులు కూడా నిర్భయంగా సేవించవచ్చు.

జె. & జె. డిషేన్
హైదరాబాద్

# ఆల్ఫా-సాంగ్

కుటుంబంలో అందరికీ సహజమైన ఆరోగ్యం ఇస్తుంది






వస్తోంది. రామనాథం ఆమె హృదయం అంతా ఆక్రమించు కున్నాడు.

మధుని చేసుకోవడానికి ఇష్టపడుతున్నానని తనకై తను తండ్రికి చెప్పలేదు. తండ్రి ఇంకోమాటు అడిగితే 'ఊఁ' అందామనుకుంది. ఆయన పెళ్ళి అంటున్నా కూడా మధు విషయం ప్రస్తావించడం లేదు. అత్తయ్య కూడా తండ్రిని అడగటం తగ్గించింది. ఆవిడకి ఆశ దాదాపు పోయింది. ఉదాసీనంగా ఉంటోంది.

ఈమధ్య తండ్రికి రక్తపుపోటు ఎక్కువయింది. అది ప్రమాదకరమైనదని ఎప్పుడు తీసుకు పోతుందో తెలియదని అంటున్నారాయన. అందుకే తన పెళ్ళి గురించి ఆయన తొందర చూపిస్తున్నారని గ్రహించాక మధుని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయానికి వచ్చేసింది. ఆ నిర్ణయానికి వచ్చాక మధు విలువ తెలుస్తోంది.

అత్తయ్య మధు మర్నాడు ప్రయాణం అవుదామనుకుంటున్నారు 'వెళ్ళేముందు ఆఖరిసారి అడుగుతా దాన్ని' అని అత్తయ్య అనడం వింది. రేఖ సంతోషపడింది. తను 'ఊఁ' అనడానికి అంతకన్నా మంచిసమయం ఉండదు.

* * *

ఊళ్ళో క్రికెట్ మాచ్ జరుగుతోందని రేఖ స్నేహితురాలు ప్రసూన చెప్పింది. రేఖ ఒళ్ళు సంతోషంతో తేలిపోయింది. క్రికెట్ అంటే ప్రాణం వాళ్ళిద్దరికీ. ఒకటి గవర్నమెంటు ఆఫీసుల్లో పనిచేసే వాళ్ళ జట్టు. రెండవది లోకల్ క్రికెట్ క్లబ్బు జట్టు. ఆ క్లబ్బు గ్రౌండ్సులో ఆడుతున్నారు.

పదింటికి ఆట ప్రారంభం. రేఖ ప్రసూన తొమ్మిది ముప్పావుదాకా నిలవరించుకుని అప్పుడు చెట్టునీడ చూసుకుని కూర్చున్నారు.

సరిగ్గా పదికి ఆట ప్రారంభం అయింది. క్రికెట్టు క్లబ్బు టాస్ గెలిచి ఫీల్డింగు తీసుకుంది. అంపైర్లు వచ్చాక ఫీల్డింగ్ టీము వచ్చింది. క్లబ్బు కెప్టెను ఫీల్డ్ ప్లేసింగ్ చూస్తున్నాడు మూడు స్లిప్పులు, థర్డ్ మేన్, కవర్ పాయింట్ ఇటు సిలీమిడాఫ్, మిడ్‌వికెట్, డీప్ స్క్వేర్ లెగ్, డీప్ ఫైన్ లెగ్.

ఆడియన్సు చప్పట్లు కొడుతుండగా

# అనగా అనగా...

ఓపెనింగ్ బాట్స్‌మెన్ ఇద్దరూ బయలుదేరారు.

దూరాన్నుంచి అనుమానంతో చూసింది రేఖ. దగ్గర్లో సంభ్రమంతో చూసింది. సందేహం లేదు. తను చూసిన అందగాడు, అందులో ఒకడు!

'ప్రసూనా! అతనే నేను చెప్పింది' అంది ఉత్సాహంగా కూర్చున్న చోటినుంచి లేవబోయినంత పనిచేసి.

'ఎవరూ?' అంది ప్రసూన.

రేఖ వేలుపెట్టి చూపించింది.

ప్రసూన అతన్ని చూడటంతోటే రేఖ ఆంతర్యం అర్థం చేసుకుంది. అంతటి అందగాడు!

'పేరేమిటి?' అంది.

'ఏమో నాకూ తెలియదు.'

అతను బౌలింగ్ మొదటగా ఫేస్ చేశాడు. మొదటి ఓవర్ మెయిడెన్. రెండో ఓవర్లో ఒక పరుగు తీసుకున్నాడు. మూడో ఓవర్నుంచీ విజృంభించాడు. వరసగా మూడు ఫోర్లు కొట్టాడు. లెగ్ సైడు లెక్కలేకుండా ఆడుతున్నాడు.

రేఖ ఒళ్ళు పులకరించింది. 'సెంచరీ కొడితే బాగుండును' అంది.

యాభై ఏడు దగ్గర అవుటయ్యాడు అతను. అప్పటికి టీము స్కోరు ఎనభై రెండు ఉంది. ఏడు వికెట్లు పడ్డాయి.

తర్వాత తొంభై మూడుకి అంతా అవుటయ్యారు. రేఖకి నిరాశ కలిగినా అతను ఆడిన తీరు అద్భుతంగా ఉందని అందరూ మెచ్చుకుంటోంటే సంతోషం పట్టలేకపోయింది. టాప్ స్కోరర్ అతనే.

రెండవ టీము బాట్ చేస్తోంటే అతను స్లిప్ లో ఉన్నాడు. అవతల మనిషి కొట్టిన బంతి గట్టిగా కాలికి తగిలింది. నిల్చున్న పళంగా ఫీల్డులో పడిపోయాడు. అందరూ చుట్టూ మూగారు. రేఖా, ప్రసూనా వెళ్దామనుకుని కూడా వెళ్ళలేకపోయారు, అంతమంది మొగాళ్ళలో వెళ్ళలేక, వెళ్ళటానికి ఇష్టపడక.

అతన్ని నెమ్మదిగా బయటికి తీసికెళ్ళిపోయారు. సబ్‌స్టిట్యూట్ - ప్లేయరుతో కొనసాగిస్తున్నారు.

రేఖ విసుగ్గా లేచింది. ప్రసూన కూడా లేచింది. ప్రసూనకి ఇంకా ఆట చూడాలని ఉంది కాని రేఖ అతనంటే ఎంతగా ఆకర్షింపబడిందో గ్రహించి ఆమె వెనకాలే వచ్చింది.

'అతనిదివరకే నీకు తెలుసా?' అంది.

'లేదే.'

'అయితే నీకేసి ఎందుకు చూశాడు?'

రేఖ సంభ్రమాన్ని అణచిపెట్టుకుని 'ఎప్పుడు చూశాడు?' అంది.

'ఫీల్డు ప్లేసింగ్ గమనించటానికి చుట్టూ చూస్తూ మనవైపు ఆగాడు. ఎందుకో.'

'నాకేం తెలుసు' అంది రేఖ ఆమె కళ్ళు వెలుగుతున్నాయి.

'పోనీ అతనెవరో తెలుసుకుంటే?'

రేఖకి ఉత్సాహం ఆగటంలేదు. 'ఎలా తెలుస్తుంది?' అంది కుతూహలంగా.

'ఆఫీసుల జట్టు ఓపెనింగ్ బాట్స్‌మన్ ఎవరని మా అన్నయ్యని కనుక్కుంటే సరి. రెండు మూడు రోజుల్లో వాడు ఊరినుంచి వస్తాడు. నీకెందుకు వారం రోజుల్లోపల నీకు వివరాలన్నీ చెబుతాగా' అంది ప్రసూన.

అప్పటినుంచీ ఇంటికి వచ్చేదాకా మనసు ఊహల్లో విహరించింది రేఖకి. ఉయ్యాల లూగుతున్న హాయి కలుగుతోంది. మనసు ప్రేమయాత్రకై ఉరకలు వేస్తోంది.

అతను కనబడినప్పటినుంచీ అతన్ని 'అతను' అనే అనుకుంటోంది. 'అతను' అంటే మన్మథుడని కూడా అర్థం ఉంది. ఏదో పేరు పెట్టుకోవాలి అతనికి, 'రథీక్' అనుకుంటే!

ప్రసూన అతని వివరాలు కనుక్కోవడం, తను తండ్రిని పంపించడం, పెళ్ళి నిర్ణయం కావటం ఎంతలో జరుగుతాయి? నిజంగా తన కలలు తనకి అంత దగ్గర్లో ఉన్నాయా! రేఖ ఉక్కిరి బిక్కిరయిపోయింది.

'ఏమిటి చూస్తున్నావు?' అంటూ వచ్చింది సత్యవతమ్మ

'ఏం లేదు.'

'ఇంకో గంటలో వెళ్ళిపోతున్నాం.'

రేఖ మాట్లాడలేదు.

'నీతో చెప్పి పోదాం అని' అంది.

పెళ్ళి సంగతి అత్తయ్య అడగబోతుందని తెలుసు రేఖకి.

'ఉండండి. తొందరేముంది' అంది మర్యాదకి.

'కాదు. పనులున్నాయి. వెళ్ళిపోవాలి.'

'మీ యిష్టం. నాన్నగారితో చెప్పారా?' తల వూపింది సత్యవతమ్మ.

ఇన్నాళ్ళూ రేఖ పెళ్ళి విషయం ఆమెని 'ఇంకా సూటిగా అడగని' పరిస్థితిని ఉంచింది సత్యవతమ్మ. ఇప్పుడు అడిగేస్తోంది.

'ఇంక మళ్ళీ రాము. ఆఖరిసారి అడుగుదామని వచ్చాను.'

'ఏమిటి?'

'మధు విషయం. వాడిని పెళ్ళి చేసుకుంటావా?'

రేఖ తల దించుకుంది.

'పోనీలేమ్మా. పొరపాటు నాదే' అంది బాధగా. అని బయటికి వెళ్ళిపోయింది.

వెళ్ళబోయే ముందు మధు వచ్చాడు.

'నన్ను చేసుకోమని అడిగిందిటగా అమ్మ?' అన్నాడు. అలా అడుగుతాడనుకోలేదు రేఖ. తల దించుకుని తల వూపింది.

అతను దెబ్బతిన్నవాడిలా కనిపించాడు. అవమానంతో మొహం చాటు చేసుకుంటున్నాడు

'చేసుకోనన్నావుటగా' అన్నాడు మామూలుగా. ఆ గొంతులో బాధ స్పష్టంగా కనిపిస్తోంది.

రేఖకి తను అశక్తురాలినని చెప్పాలని ఉంది. మాటలు రాలేదు.

'వెడుతున్నాను రేఖా ఇంక మళ్ళీ రాను. గుడ్ బై' అంటూ వెళ్ళిపోయాడు మధు.

* * *

ముందు గది మళ్ళీ ఖాళీ అయింది. కృష్ణమూర్తి కొంతకాలం ఆ గదిలో ఉన్నాడు. తర్వాత మధు ఆక్రమించుకున్నాడు. ఇప్పుడు ఖాళీ అయింది.

ఆ గదిని ఇప్పుడెవరికి ఇవ్వాలో రేఖకి బాగా తెలుసు తన కాబోయే భర్తకివ్వాలి. అతను రీడింగ్ రూముగా ఉపయోగించుకుంటాడు. అతనికి కాఫీ యిచ్చినా, టిఫిను ఇచ్చినా అక్కడికే పట్టుకెళ్ళి ఇస్తుంది. అక్కడే ఆఫీసు పని, పేపరు చదువుకోవడం లాంటివి చేస్తాడు.

ఆ గదిని కడిగించి ముగ్గులు పెట్టింది. పాతనం పాత చిహ్నాలు అన్నీ చెరిపివేసింది. కిటికీలు, తలుపులు అద్దాల బీరువా అన్నీ శుభ్రంగా తుడిపించింది. అంతా కొత్తగా తయారు చేసింది. అగరొత్తులతో కొత్త సుగంధం నింపింది.

జయమ్మకి ఎప్పుడు తెలిసిందో వెంటనే వచ్చింది. ముందు గది ఖాళీ అయింది కాబట్టి దానికి వెనక రెండు గదులు కలిపి పోర్షనుగా ఇమ్మంది. ఇదివరకు ఇచ్చిన వాగ్దానం గుర్తు చేసింది. ఆవిడకి ముందు రీడింగు రూము బాగా నచ్చింది. అది వాళ్ళ ఆయనకి ప్రత్యేకించవచ్చు అనుకుంది.

మధు ఖాళీ చెయ్యగానే అది జయమ్మకిస్తానని ఇదివరకు వాగ్దానం చేసింది కాబట్టి తన పెళ్ళికింకా ఎలా చూసినా టైముంటోంది కాబట్టి ఆ యిల్లు జయమ్మకివ్వడానికి ఒప్పుకుంది రేఖ.

'మా ఆయన కూడా చూపించి వెంటనే చేరతాం. అంతా నీ పెత్తనమేనా అని తిడతారు మళ్ళీ' అంది జయమ్మ. భర్తని పిలుచుకురావడానికి అరగంటలో వస్తానని వెళ్ళింది.

రేఖ మనస్సు ఇటు లేదు. ప్రసూన ఏదో సమాచారం తెలిసింది వస్తాను అంటూ కబురు చేసింది. రేఖకి ఆతృత అధికంగా ఉంది.

స్నానంచేసి మంచి బట్టలు వేసుకుని వసారాలోకి వస్తూంటే జయమ్మ ఎదురుపడింది. 'ఉండండి, తాళంచెవి నాన్నగారిని అడిగివస్తాను' అంటూ లోపలికి వెళుతూనే ఏదో సుపరిచిత గొంతుక విని వెనక్కి తిరిగి చూసింది.

నిర్విణ్ణురాలయిపోయింది. అతను! ఆ అందగాడు! తన సుధీర్! తను కావాలనుకున్న భర్త! తెల్లటి పాంటు షర్టు వేసుకుని రాధని ఎత్తుకుని నవ్వుతున్నాడు. కాలికి క్రికెట్ లో తగిలిన దెబ్బకి కట్టు ఉంది. 'జయా, దీన్ని తీసుకో. నా దగ్గర ఉండటంలేదు' అంటున్నాడు. 'ఉండండి' అంటోంది జయ.

జయమ్మ భర్త అతను!

రేఖ జీవితంలో మొదటిసారిగా దెబ్బతింది. ఒంట్లో శక్తి అంతా తీసేసినట్టయింది. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా లోపలికి నడిచి 'అసలు ఇల్లు ఎవరికీ ఇవ్వటంలేదని చెప్పు నాన్నా వాళ్ళతో' అంది.

(అయిపోయింది) ●

పాఠ్య గ్రంథాలు చూసి
పరీక్షలు వ్రాసే పద్ధతి

